01ATP19F_01ATP19F.qxd 19-03-2023 PM 10:49 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 20 మార్చి 2023 పేజీలు : 04


# భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి ధృవీకరణ పత్రం అందజేత



కలెక్టర్ నుంచి ధృవీకరణ పత్రం అందుకుంటున్న భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

**అనంతపురం, మార్చి 19 ప్రభాతవార్త బ్యూరో**

కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను సాఫీగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎ స్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం అనంతపుఏరం కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో పశ్చిమ రాయలసీమ పట్టభద్ర ఎన్నికల్లో గెలిచిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ దృవీకరణ పత్రం (సర్టిఫికెట్ ఆఫ్ ఎలక్షన్)ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం (కపడ-అనంతపురం-కర్నూలు) ఎన్నికల పోలింగ్ ఈ నెల 13వ తేది నిర్వహించడం జరిగిందని, ఈ నెల 16వ తేదిన గురువారం కౌంటింగ్ ప్రక్రియను మొదలు పెట్టి 18వ తేదిన శనివారం రాత్రికి పూర్తి చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియను పూర్తయిన తర్వాత వచ్చిన రిజల్ట్ షీట్‌ను జరిగిన కౌంటింగ్ ప్రక్రియపై రిపోర్టును ఈసీఐ వరకు సబ్మిట్ చేయడం జరిగిందన్నారు. ఈసీఐ వారు రిజల్ట్ డిక్లేర్ చేయడానికి పర్మిషన్ శనివారం అర్థరాత్రి 1:30 గంటల సమయంలో ఇవ్వడం జరిగిందన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో టిడిపి మద్దతుతో పోటీ చేసిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి 1,09,781 ఓట్లు రాగా, 7543 ఓట్ల మెజార్టీతో గెలిచారన్నారు. భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి గెలిచినట్లు ధృవీకరణ పత్రం (సర్టిఫికెట్ ఆఫ్ ఎలక్షన్)ను ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో కడప-అనంతపురం-కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలను పూర్తి చేసి, పోలింగ్, కౌంటింగ్ సాఫీగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు బికె.పార్థసారధి, వి.ప్రభాకర్‌చౌదరి, కడప జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకులు ఉమా మహేశ్వరనాయుడు, పరిటాల శ్రీరామ్, ఆలం నరసనాయుడు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# జగనన్న విద్యాదీవెన పంపిణీ

## -జిల్లాలో 32,909 తల్లుల ఖతాలకు రూ.22,85,13,497లు జమ



మెగా చెక్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్

**శ్రీసత్యసాయిజిల్లా, మార్చి 19, ప్రభాతవార్త ప్రతనిధి:**

నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన క్రింద 2022 అక్టోబర్ - డిసెంబర్ త్రైమాసికానికి సంబందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం ప్రారంభించగా,ఆ కార్యక్రమాన్ని పుట్టపర్తి కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 36,391 మంది విద్యార్థులకు గాను 32,909 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.22,85,13,497లను డిబిటి ద్వారా బటన్ నొక్కి జమచేశారు. ఇందులో4,912 ఎస్‌సి విద్యార్థులకు గాను 4457 మంది తల్లుల ఖాతాల్లో రూ.3,95,42,101లు, 2044 మంది ఎస్‌టి విద్యార్థులకు గాను 1829 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.1,23,78,819లు, 19356 మంది బిసి విద్యార్థులకు గాను 17,313 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.11,15,07,283లు, 3785 మంది ఇబిసి విద్యార్థులకుగాను 3520 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.3,06,38,391లు, 3431 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకుగాను 3123 మంది తల్లుల ఖాతాలకు రూ.1,69,46,358లు, 2,836 మంది కాపు విద్యార్థులకుగాను 2643మంది తల్లుల ఖతాలకు, రూ.1,73,53,064లు, 27 మందిక్రిష్టియన్ మైనారిటీ విద్యార్థులకుగాను 24 మంది తల్లుల ఖతాలకు రూ.1,47,471లు జమచేయడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులకు నమూనా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బిసి కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులుగిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, బిసి సంక్షేమ అధికారి నిర్మలజ్యోతి, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# అకాల వర్షాలు.. వడగండ్ల వానకు భారీ నష్టం

## - అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో కోలుకోని దెబ్బ - కోట్లల్లో పంట, పండ్ల తోటలకు నష్టం



పుట్లూరు మండలంలో భారీగా దెబ్బతిన్న అరటి పంట



దెబ్బతిన్న పండ్ల తోటల్లో పర్యటించిన జిల్లా ఉద్యాన శాఖ అధికారులు

**అనంతపురం, మార్చి 19 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో కురిసిన అకాల వడగండ్ల వాన, ఈదురు గాలులకు కోట్లలో పంట నష్టం జరిగింది. రైతులు కోలుకోలేని రీతిలో పండ్లతోటలు, పంట నష్టం జరిగింది. ముఖ్యంగా వడగండ్ల వాన, ఈదురు గాలులు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో విస్తారంగా పడటంతో పండ్ల తోటలకు, పంటలకు ఎక్కువ నష్టం జరిగిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తగిన రీతిలో న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లాలో నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో పండ్ల తోటలకు భారీ నష్టం వాటిల్లింది. నార్పల మండలం హెచ్ సోదనపల్లి, సజ్జల చెరువు, కాచేపల్లి, నాయినిపల్లి, మద్దలపల్లి, దిగువ పల్లి తదితర గ్రామాలు, పుట్లూరు మండలం కడవకల్లు ఎల్లుట్లి రగామాలు యల్లనూరు మండలాల్లో చిలమకూరు తదితర గ్రామాల్లో అరటి, మామిడి, చీనీ, టమోటా, బొప్పాయి, కర్బూజా తదితర పండ్ల తోటలు భాగా దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. అనంతపురం జిల్లాలో ప్రాథమిక అంచనాల ప్రకారం 1169 హెక్టార్లలో 866 మంది రైతులకు చెందిన 1320 లక్షల పంట నష్టం జరిగిందని అధికారులు అంచనాకు వచ్చారు. ఇందులో అరటి 897 లక్షల పంట నష్టం, చీనీకి 156 లక్షలు నష్టం జరిగిందని తమ దృష్టికి వచ్చిందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రఘునాథరెడ్డి ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిసింది. వడగండ్ల వాన, ఈదురు గాలులతో ఎక్కువ పంట నష్టం జరిగినట్లు తమ నివేదికల్లో అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఇదే సమయంలో అనంతపురం జిల్లాలో పండ్ల తోటలతోపాటు వరి, వేరుశనగ, మొక్కజొన్న, కుసుమ, కొర్ర, జొన్న తదితర పంటలు కూడా 2,453 హెక్టార్లలో నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా. పుట్లూరు గార్లదిన్నె, బుక్కరాయ సముద్రం, శింగనమల, అనంతపురం రూరల్, గుంతకల్లు, తాడిపత్రి, పామిడి, నార్పల, యల్లనూరు తదితర మండలాల్లో వడగండ్ల వానకు పంట నష్టం జరిగి 2,453 హెక్టార్లలో నష్టం జరిగిందని, దీనిలో భాగంగా దాదాపు 14 కోట్ల రూపాయలు పంట నష్టం జరిగినట్లు అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలతో నివేదిక ఇచ్చినట్లు సమాచారం.

**సత్యసాయి జిల్లాలో 416 హెక్టార్లలో పంట నష్టం :**

సత్యసాయి జిల్లాలోని అమడగూరు, నల్లచెరువు, తనకల్లు, బుక్కపట్నం, ధర్మవరం, కొత్త చెరువు, బత్తలపల్లి, పెనుకొండ, రొద్దం, కదిరి, ముదిగుబ్బ, తలుపుల, ఎన్‌పికుంట, గాండ్లపెంట తదితర మండలాల్లో మొక్కజొన న్న, వేరుశనగ, పొద్దు తిరుగుడ, రాగి, తదితర పంటలు వడగండ్లవాన, ఈదురు గాలుల వల్ల 416 హెక్టార్లలో పంట నష్టం జరిగి భారీ ఎత్తున రైతులు నష్టపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో పంటలతోపాటు పండ్ల తోటలు కూడా 155 హెక్టార్లలో 254





మంది రైతులకు సంబంధించి 74.54 లక్షలు విలువ చేసే పండ్ల తోటలు దెబ్బతిన్నట్లు సమాచారం. ఇందులో ముఖ్యంగా అమడగూరు, తనకల్లు, కదిరి, బత్తలపల్లి, నల్లచెరువు, తలుపుల, ధర్మవరం, తాడిమర్రి, సికెపల్లి, కొత్తచెరువు, పెనుకొండ, ఎన్‌పికుంట తదితర మండలాల్లో అరటి, మామిడి, పండ్ల తోటలతోపాటు కళింగర, కర్బూజా, మిరప, ఉల్లి, టమోటా తదితర పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారుల దృష్టికి రైతులు నివేదించారు. శింగనమల మండలం గోవిందరాయుని పేటకు చెందిన శివశంకర్‌రెడ్డి అనే రైతు మాట్లాడుతూ.. ఈదురు గాలులు, వడగండ్ల వాన వల్ల తమ తోటలో మామిడి, నేరేడు, నిమ్మ చెట్లు, బొప్పాయి తోటలు దెబ్బతిని దాదాపు 10 లక్షలు నష్టం వాటిల్లిందని అధికారులు తగిన రీతిలో స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. అదే విధంగా నూతన పాటి చిదంబరం అనే రైతు మాట్లాడుతూ.. వడగండ్ల వాన, ఈదుర గాలుల వల్ల తమ పొలంలో భారీగా పండ్ల తోటలు దెబ్బతిని కోటి రూపాయలు నష్టం వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొలంలో ఎంతో పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశానని, వడగండ్ల వాన వల్ల అపార నష్టం వచ్చిందన్నారు. 15 ఎకరాల్లో కర్బూజా, 5 ఎకరాల్లో బీర, 10 ఎకరాల్లో మామిడి, మరో 10 ఎకరాల్లో ఇతర పంటలు వడగండ్ల వాన, ఈదురు గాలుల వల్ల భారీగా నష్టం జరిగిందని, అధికారులు స్పందించి తగిన న్యాయం చేయాలని ఆయన అధికారులను కోరారు.

# మాటల గారడి ఫెయిల్యూర్ సీఎంకు బుద్ది చెబుదాం

## - మేం అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక చట్టం తెస్తాం - జగన్ రాయలసీమ బిడ్డకాదు.. క్యాన్సర్ గడ్డ

## - ప్రసంగంతో ప్రజలకు జోష్ నింపిన లోకేష్ - జోగన్న పేట బహిరంగ సభలో ప్రభుత్వంపై విరుచుకు పడ్డ లోకేష్



మాట్లాడుతున్న నారా లోకేష్

**కదిరి, మార్చి 19 ప్రభాతవార్త**

మాటల గారడితో ప్రజలను బురిడీ కొట్టిస్తున్న ఫెయిల్యూర్ సిఎంకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. 47వ రోజు యువగళం పాదయాత్రలో భాగంగా కదిరి నియోజకవర్గంలోని జోగన్న పేటలో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. దౌర్జన్యాలు, అరాచకాలు, అక్రమ కేసులు పెరిగిపోయాయని గుర్తు చేశారు. తాను రాయలసీమ బిడ్డ అని చెప్పుకుంటున్న ఫెయిల్యూర్ సిఎం రాయలసీమకు వరిగిపెట్టింది ఏమిటో స్పష్టం చేయాలన్నారు. సొంత జిల్లాలో కూడా స్టీల్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయని చేతకాని దద్దమ్మ జగన్‌మోహన్ అన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక మైనార్టీలను వేదిస్తూ అక్రమ కేసులు బనాయించడం, ఆనవాయితీగా మారిందన్నారు. రాయలసీమ ముస్లింల పట్ల వైసీపీ గూండాలు వ్యవహరించిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మదనపల్లిలో తమ కూతురు కన్నా మైనార్టీలకు చెందిన బాలిక ఎక్కువ మార్కులు తెచ్చుకుందన్న అక్కసుతో వైసీపీ నాయకుడు పెట్టిన వేదింపులకు చిన్నారరి బలైందన్నారు. నంద్యాల, నందికొట్కూరు, కడప జిల్లాలో మైనార్టీలను వేదించిన ఘనత వైసీపీ పార్టీకే దక్కిందన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ఇంతటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నా కేసులు నమోదు చేయకపోవడమే కాక, అరెస్టులు చేయకపోవడం చూస్తే రాష్ట్రంలో జగన్ పాలన ఏ విధంగా సాగుతుందో స్పష్టం అవుతుందన్నారు. బిసి వర్గాలపై కూడా అక్రమ కేసులు బనాయించారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల లాగా బిసిలను ఎవరైతే కించ పరుస్తున్నారో వారిపై కూడా ఇదే తరహాలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి బిసిలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 22 మ ంది ఎ ంపిలు, 9 మంది రాజ్య సభ ఎ ంపిలు ఉన్నప్పటికీ పార్లమెంట్‌లో ప్రత్యేక హోదాపై ఏం పీకారంటూ ఎద్దేవా చేశారు. హిందూపురం పార్లమెంట్‌కు, అధికార పార్టీకి చెందిన ఎంపి ఉన్నప్పటికీ ఏనాడైనా హిందూపురం పార్లమెంట్‌కు సంబంధించి కదిరి నియోజకవర్గంకు సంబంధించి సమస్యలు ఏవైనా లేవనెత్తారా అంటూ నిలదీశారు. రాయలసీమలో హంద్రీనీవా పనులు టీడీపీ హయాంలో 90 శాతం పూర్తి చేస్తే 10 శాతం పూర్తి చేయలేని చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అం టూ విరుచుకు పడ్డారు.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ ప్రాజెక్టులు ఏవైనా తెచ్చి అవి పూర్తి చేశారా అంటూ ప్రశ్నించారు. అనంతపురం జిల్లా రైతులకు గత ప్రభుత్వ హయాంలో 90 శాతం రాయితీతో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తే ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు సంబంధించి రాయితీల ఊసే లేదన్నారు. అనంతపురం జిల్లాకు కియా, జాకీ, వందలాది పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఇక కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి విషయానికి వస్తే.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేని అసమర్థత ఎమ్మెల్యే అని దుయ్యబట్టారు. రూ.50వేల పైబడిన కాంట్రాక్టు వర్కులు కూడా తాను తన అనుచరులకు, అనుచర వర్గం వారే చేసుకుంటున్నారే తప్పా కార్యకర్తలకు న్యాయం చేశారా అంటూ నిలదీశారు. నియోజకవర్గంలోని ఎన్‌పికుంటలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంటులో పెద్ద ఎత్తున ఎమ్మెల్యే అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కదిరి పట్టణంలో ఎక్కువ మంది ముస్లిం మైనార్టీలు, బిడి కార్మికులు జీవనం సాగిస్తున్నారని, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, భూ గర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తానని అప్పట్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందన్నారు. ఇలాంటి అరాచకాలకు, దౌర్జన్యాలకు స్వస్తి పలకాలంటే రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జగన్ రాయలసీమ బిడ్డకాదు రాయలసీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ అన్నారు. ఆ గడ్డను తొలగించాలంటే రేడియేషన్ అన్న ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సత్యసాయి జిల్లా పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారధి, మాజీ మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్యేలు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్, అత్తార్ చాంద్‌బాషా, కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వరనాయుడు, పరిటాల శ్రీరామ్, పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.

# సైకో ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పిన పట్టభద్రులు

## - ఇక వచ్చేది టిడిపి ప్రభుత్వమే - టిడిపి నేత పెరుమాళ్ల జీవానందరెడ్డి వెల్లడి

**అనంతపురం, మార్చి 19 ప్రభాతవార్త బ్యూరో**

సైకో ప్రభుత్వానికి తగిన గుణపాఠం పట్టభద్రులు చెప్పారని తెలుగుదేశం పార్ీ సీనియర్ నాయకులు గుంతకల్లు నియోజకవర్గం పిజెఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గం (కడప-అనంతపురం-కర్నూలు) ఎమ్మెల్సీగా భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఘన విజయం సాధించారన్నారు. వెన్నపూస రవీంద్రరెడ్డిపై 7543 ఓట్ల తేడాతో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గెలుపొందారన్నారు. అనంతపురం నగరంలోని జెఎన్‌టియు కళాశాలలో పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా గురువారం ఉదయం 8:00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టగా, శనివారం రాత్రి 8 గంటల వరకు నిర్వహించారు. ఈ కౌంటింగ్‌లో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి 1,09,781 ఓట్లు రాగా, వెన్నపూస రవీంద్రారెడ్డికి 1,02,238 ఓట్లు వచ్చాయన్నారు. పశ్చిమ ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలలో గణవిజయం సాధించిన భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వేపాడ చిరంజీవి కంచర్ల శ్రీకాంత్‌గార్లకు మ ఉందుగా హార్ధిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఘన విజయానికి సహకరించిన పట్టభద్రులకు టిడిపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ పాలనలో అరాచక పాలన నడుస్తోందని ప్రజల ఆరోగ్యాలు చిన్నాభిన ంన చేస్తూ ఆరోగ్యాలు తగ్గిస్తూ నిరుద్యోగులు పెంచుతూ ఉన్న వైసీపీ ప్రభుత్వానికి పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో కూడా ఇదే తరహాలో టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబునాయుడు త్వరలోనే పట్టభద్రలందరికీ తగిన న్యాయం చేస్తారన్నారు. రైతన్నలను ఆదుకుంటామని వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రోజురోజుకు నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. సామాన్య ప్రజల నడ్డి విరిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రైతన్నలు ప్రజలు 2024లో తగిన గుణపాఠంచెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రైతన్నలు నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

## 12 ఎకరాల అరటి తోట నేలపాలు

- 40 లక్షల ఆస్తి నష్టం.. బోరుమంటున్న రైతులు


నేల వాలిన అరటి మొక్కలు

బొమ్మనహాళ్, మార్చి 19 ప్రభాత వార్త : మండల పరిధిలోని గోవింద వాడ గ్రామంలో నివాసంగల ఈదు కల్లు వన్నూరు స్వామి, ఈదుకల్లు ప్రభాకర్ అనే రైతులు సాగు చేసిన 12 ఎకరాల అరటి తోట అకాలంగా కురిసిన వడగండ్ల గాలి వానకు నేల వాలిందని 40 లక్షల రూపాయలు నష్టం వచ్చినట్లు రైతులు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశామని, కళ్లముందే నోటికిఅందాల్సిన అరటితోట నేలవాలిందని వాపోయారు. కెజి.25 రూపా యలుకొన్న వ్యాపారులు ప్రస్తుతం 5రూపాయలకుకొంటున్నారని ఇలా అయి తే మేము ఎలా బ్రతకాలని అంటున్నారు. రాత్రి పగలు కష్టపడి పసిపాపను పెంచినట్లు మొక్కలను పెంచామని భగవంతుడు మాపై దయచూపలేదని రోధిస్తూ తెలిపారు. ఎకరాకు 25 టన్నులు పండే పంట నేల వాలిందని ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించండి

-మంత్రి కొట్టు సత్యనారాయణను కోరిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

-మ్యాచింగ్ గ్రాంటు తగ్గింపు, డార్మెంటరీ హాలు నిర్మాణానికి హామీ


దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ, మార్చి 19 ప్రభాతవార్త : నియోజక వర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి కోరారు. శనివారం మంత్రిను ఆయన నివాసంలో ఎమ్మెల్సీ ప్రత్యేకంగా కలిశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ మండలం పెన్నహోబిళంలోని శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం 25 గదులు, నాలుగు హాళ్లు కలిపి మొత్తం రెండు అంతస్తుల డార్మెంటరీను తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మించాలని గతంలో కోరడం జరిగిందని, దానికి సంబంధించి నిర్మాణ వ్యయ అంచనాలువేసి దేవాదాయశాఖకు పంపడం జరిగిందన్నారు. వాటిని వెంటనే మంజూరుచేసి భక్తుల సౌకర్యార్థం వసతి గృహ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతాండా గ్రామ సమీపంలోని శ్రీ భద్రంపల్లి ఆంజినేయస్వామి ఆలయం నిర్మించడానికి దేవాదాయశాఖ సిజిఫండ్ద్వారా 60 లక్షల రూపాయలు చేసిందని అందులో ఆ దేవాలయ కమిటీ వారు 20శాతం మ్యాచింగ్ గ్రాంటు కట్టవలసి ఉందని అంత సొమ్ము వారు చెల్లించలేరని ఆ మ్యాచింగ్ గ్రాంటు 20శాతం నుండి 10 శాతానికి తగ్గించాలని కోరారు. ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామంలో నిర్మించతలపెట్టిన శ్రీ ఆంజినేయస్వామి దేవాలయంకు 27.5 లక్షల రూపాయలు సిజి ఫండ్ ద్వారానే మంజూరు అయిందని ఆ మ్యాచింగ్ గ్రాంటును కూఆ 10శాతానికి తగ్గించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి కొట్టు సత్యనారాయణ వెంటనే సదరు దేవాలయాల నిర్మాణానికి ఆలయ కమిటీ చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంటును 10శాతం మేరకు తగ్గించడానికి హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. దానికి సంబంధించిన ఉత్తర్వులను వెంటనే జారీ చేస్తామని, పెన్నహోబిళంలో డార్మెంటరీ హాలు నిర్మాణాల అంచనా వ్యయాలను ఆమోదించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని మంత్రి చెప్పారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వివరించారు.

## ఉగాది పండుగను దృష్టిలో ఉంచుకొని కార్మికులు సమ్మె విరమించాలి

- మీ సమస్యలను విశ్వన్న ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతాం- ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్లతో నీటి సరఫరాకు చర్యలు- విలేఖరుల సమావేశంలో సర్పంచ్ మీనుగ లలిత, ఎంపీపీ చందా చంద్రమ్మ


విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మీనుగ లలిత, ఎంపీపీ చందా చంద్రమ్మ

ఉరవకొండ, మార్చి 19 ప్రభాతవార్త

ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉగాది పండుగను దృష్టిలో ఉంచుకొని శ్రీరామిరెడ్డి తాగునీటిపథకం కార్మికులు సమ్మెను విరమించాలని ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మీనుగ లలిత, ఎంపీపీ చందా చంద్రమ్మ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని స్థానిక పంచాయతీ కార్యాల యంలో ఆదివారం మధ్యాన్నం ఏర్పాటుచేసిన విలేఖరులసమావేశంలో వారు వైసీపీ పంచాయ తీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యం.బసవరాజుతో కలిసి మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కార ఒకోసం సమ్మెచేస్తున్నపుడు ప్రజలు ఇబ్బందులుపడకుండా చూసుకోవాల్సినబాధ్యత కార్మికులపైన కార్మిక సంఘాలపైన ఉంటుందని సమస్యలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. కార్మికుల సమస్యలను ఆసరాగా చేసుకొని కొన్ని రాజకీయ పార్టీలు కార్మికులను రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. కార్మికుల సమస్యలను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ద్వారా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఉరవకొండ పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయడానికి అవసరమైన చర్యలు తీసుకొంటున్నామన్నారు. నింబగల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నుండి ఏరోజున ఏ వార్డుకు నీటిని సరఫరా చేస్తామనేది కూడా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు పద్మావతి, శర్మస్, మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, జేసీఎస్ మండల కన్వీనర్ బి.ఆసీఫ్, వైసీపీ నాయకులు అన్వర్, ప్రకాష్, జోగి హనుమంతు, శేఖర్, శీన పాల్గొన్నారు.

## వేధింపులపై కేసు నమోదు

గుత్తి , మార్చి 19 ప్రభాతవార్త : పట్టణానికి చెందిన సంధ్య అనే వివాహితను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా నివాసం వుంటున్న సంధ్య అనే యువతికి 6 సంవత్సరాల క్రితం రాయదుర్గంకు చెందిన మంజునాథ్‌తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో వరుడు కోరిక మేరకు బంగారు, నగదు కట్నం రూపంలో ఇచ్చారని అయినప్పటికి అదనపు కట్నం కోసం అత్తింటి నుండి వేధింపులు ఎక్కవయ్యాయి. ఆరు నెలల క్రితం గుత్తికి వచ్చిన సంధ్య వేధింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్త రుక్మిణి, ఆడపడచు వనిత, నాగరాజు, రమేష్, తిప్పేస్వామిలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రియల్ ఎస్టేట్‌వ్యాపారి కిడ్నాప్

- వైసిపి నాయకుని సహా పలువురు అరెస్ట్

హిందూపురం, మార్చి 19 ప్రభాతవార్త

పట్టణంలో రియల్ ఎస్టేట్‌వ్యాపారి కిడ్నాప్ ఉదంతం కలకలం రేపింది. ఒన్‌టౌన్ సిఐ ఈరన్న తెలిపిన మేరకు వివరాలు ఇలా వున్నాయి. పట్టణంలోని ఆర్టీసి కాలనీలో కురబ శివలింగప్ప అనే రియల్‌ఎస్టేట్ వ్యాపారిని స్థానిక ఎస్.సడ్లపల్లికి చెందిన వైసిపి నాయకుడు వెంకటేష్‌బాబు అలియాస్ బాబురెడ్డి అతని అనుచరులు కిడ్నాప్ చేసినట్లు కేసు నమోదైంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 13వవార్డు సడ్లపల్లి నుండి వైసిపి కౌన్సిలర్ అభ్యర్థిగా బాబురెడ్డి పోటీ చేసి ఓటమి చెందిన విషయం తెలిసిందే. కాగా బాధితుడు శివలింగప్ప భార్యకు కిడ్నాప్ విషయం తెలియడంతో ఆమె శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివలింగప్పను రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా స్థలాలు చూద్దామని చెప్పి బాబురెడ్డి సమీపంలోని కర్నాటక ప్రాంతానికి తీసుకెళ్లి అక్కడి నుండి కిడ్నాప్ చేసి ఓ తోటలో వుంచి లక్షలాది రూపాయలు డిమాండ్ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. అంతేకాకుండా బొమ్మ తుపాకి చూపించి డబ్బులు ఇవ్వకపోతే చంపివేస్తామని బెదిరించినట్లు చెబుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు అందిన తదుపరి రంగంలోకి దిగిన పోలీసులు బాబురెడ్డి, తదితరులను అరెస్ట్ చేశారు. అతని నుండి ద్విచక్రవాహనం, బొమ్మ తుపాకి, శివలింగప్పతో అక్రమంగా వ్రాయించుకున్న ప్రాంసరినోటు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామని సిఐ తెలిపారు.

## ఘనంగా సరస్వతిపూజ


సరస్వతిపూజ అనంతరం భోజనం చేస్తున్న విద్యార్థులు

చిలమత్తూరు, మార్చి 19 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని గ్లోబల్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో సరస్వతిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శిక్షణాలయంలోని సరస్వతిదేవి అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి పండితుల వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్లోబల్ కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ నిర్వాహకుడు నాగేంద్ర తన సొంత ఖర్చుతో విద్యార్థులకు అన్నదాన కార యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు, మిత్రబృందం, పాల్గొన్నారు.

## సీతారామస్వామి దేవాలయం అభివృద్ధికి విరాళం


ఆలయం అభివృద్ధికి విరాళం అందచేస్తున్న మండల కన్వీనర్ జయప్ప

లేపాక్షి, మార్చి 19 ప్రభాతవార్త

మండలంలోని బినలమనెవల్లి గ్రామంలో వెలసిన శ్రీసీతారామ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం తెలుగు దేశం పార్టీ లేపాక్షి మండల కన్వీనర్ జయప్ప 15 వేల రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించాలని కమిటీ సభ్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఈ విరాళాన్ని అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కార్మికుల నిరవధిక సమ్మెకు సీపీఎం మద్దతు

-3వ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె


కొనకొండ్లలోని పంప్‌హౌస్‌వద్ద కార్మికులతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, మార్చి 19 ప్రభాతవార్త : వివిధ సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 3వ రోజు కొనసాగింది. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని మంచినీటి పథకం పంప్‌హౌస్‌వద్ద కొనసాగిన కార్మికుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం పార్టీ మండల కార్యదర్శి విరుపాక్షి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన 2 సంవత్సరాల బోనస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ, బకాయిపడ్డ రెండు నెలల జీతం వెంటనే చెల్లించి గత నవంబర్‌లో జరిగిన ఒప్పొందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకాలం 19రోజులకు జీతంచెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో కార్మికుల సంఘం అధ్యక్షులు చిన్నబాబయ్య, సహాయ కార్యదర్శి లాలుస్వామి, కార్మికులు క్రిష్టప్ప, రామాంజినేయులు, రమేష్, సంతోష్, యాకూబ్, యుగంధర్‌బాబు, సీపీఎం నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వశికేరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టుచే 100 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

-సురక్షితంగా స్వస్థలాలకు చేర్చిన ట్రస్టు


ఆపరేషన్లు చేయించుకున్న వారితో వశికేరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టు వైస్ చైర్మెన్ వశికేరి మల్లికార్జున

ఉరవకొండ, మార్చి 19 ప్రభాతవార్త

దివంగత మాజీ ఎమ్మెల్యే వశికేరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 100 మంది కంటి ఆపరేషన్లు పూర్తి అయ్యాయి. ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఉరవకొండ పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాల ఆవరణంలో నంద్యాలకు చెందిన శాంతరాం ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మోగా వైద్య శిబిరంలో కంటిచూపు సరిగాలేని వారిని ఎంపికచేసి వారికి శుక్లం ఆపరేషన్లు నిర్వహించడానికి ట్రస్టు సొంత ఖర్చుతో ప్రత్యేక వాహనంలో నంద్యాలకు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అక్కడ 100 మందికి ఆపరేషన్లు పూర్తికాగా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వారు ఆదివారం ఉరవకొండకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు చేయించుకున్న వారు మాట్లాడుతూ తమకు ఆపరేషన్లు చేయించిన వశికేరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మెన్ వశికేరి రమేష్, వైస్ ఛైర్మెన్ వశికేరి మల్లికార్జున, కోశాధికారి వశికేరి మహేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## యువగళంలో పాల్గొన్న టిడిపి నాయకులు


యువగళంలో పాల్గొన్న యూత్ ఫోరం నాయకులు

అమరాపురం, మార్చి 19 ప్రభాతవార్త

కదిరి నియోజకవర్గంలో మూడవ రోజు కొనసాగుతున్న యువగళం లోకేష్ బాబు పాదయాత్రలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో మడకశిర నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు బెంగళూరు యూత్ ఫోరం నాయకులు పాల్గొన్నారు. బెంగళూరు యూత్ ఫోరం నాయకులు కెఎన్‌పల్లి సురేష్, కరిదాసన హట్టి కాంతరాజు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, నియోకవర్గ అధ్యక్షులు ఆర్ జయకుమార్ తదితరులు సమక్షంలో ఎస్సీ విభాగానికి చెందిన నాయకులు లోకేష్‌కు అంబేద్కర్ చిత్రపటానిన బహుకరించారు.

## టౌన్‌బ్యాంకు అభివృద్ధికి చేయూతనివ్వాలి

-టౌన్‌బ్యాంకు ఛైర్మన్ అబ్దుల్‌జిలాన్


బ్యాంకు ఛైర్మన్ జిలాన్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మార్చి 19 ప్రభాతవార్త

గుత్తి కో ఆపరేటీవ్ టౌన్‌బ్యాంకులో రుణం తీసుకున్న ఖాతాదారులు బకాయిలు క్రమం తప్పకుండా చెల్లిస్తూ బ్యాంకు పురోభివృద్ధికి దోహదపడాలని బ్యాంకు ఛైర్మన్ అబ్దుల్‌జిలాన్ ఆకాంక్షించారు. ఆదివారం వసుధ ఫంక్షన్‌హాల్‌లో బ్యాంకు సర్వజన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరానికి 4241 మంది ఖాతాదారులతో 97 కోట్ల మేర డిపాజిట్లతో బ్యాంకు అభివృద్ధి పథంలో కొనసాగుతోందన్నారు. అదేవిధంగా 82 కోట్ల మేర రుణాలు పంపిణీ చేశామని 5 కోట్ల మేర షేర్ క్యాపిటల్‌తో ఖాతాదారులకు 8 శాతం డివిడెంట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు సిఇఒ మహేశ్వరప్రసాద్, వైస్‌ఛైర్మన్ కృష్ణ, డైరెక్టర్లు వీరన్న, బాబు, రామ్మోహన్, నాగరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ విజయం వచ్చే ఎన్నికలకు టిడికి శుభసూచకం


మాట్లాడుతున్న మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

కొత్తచెరువు, మార్చి 19, ప్రభాతవార్త

చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమౌతుందని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి విజయాన్ని కట్టబెట్టి శుభసూచకం అందించారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కొత్తచెరువులోని గృహప్రవేశ మహోత్సవానికి హాజరైన ఆయన తెదేపానాయకులతో కలసి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, తూర్పు, పశ్చిమ పట్టభద్రుల నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయంసాధించడం ఆనందంగా ఉందన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రజలుకోరుకుంటున్నారన్నారు. విశాఖకు రాజధానిని మార్చాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పినప్పటికీ దానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పట్టభద్రులు ఓటుతో నిరసన తెలియజేశారని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, బెదిరించాలని చూసినా, ఎన్నికుట్రలు పన్నినా స్వచ్ఛంధంగా ఓటు హక్కును వినియోగించుకొని తెదెపాను ఆదరించారన్నారు. మూడు పట్టభద్రుల నియోజకవర్గాల్లోను తెదేపా గెలవడంతో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి ఒక ఉత్సాహం నెలకొందన్నారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర సత్యసాయి జిల్లాలోకి రావడంతో సత్యసాయి జిల్లా వాసులు బ్రహ్మరథం పట్టారని,ఈ పాదయాత్ర 400 రోజుల పాటు, 4 వేల కిలోమీటర్ల మేర చేపడుతుండడం ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీనే విజయం సాధిస్తుందని, రాక్షస పాలన అంతం మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లెతో పాటు కన్వీనర్ రామకృష్ణ, సాలక్కగారి శ్రీనివాసులు, వలిపి శీన, బండ్లపల్లి రాజు తదితర తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ప్రశ్నాపత్రాలను భద్రపరచిన అధికారులు

కొత్తచెరువు, మార్చి 19, ప్రభాతవార్త :


ప్రశ్నపత్రాలు భద్రపరచిన గదికి సీల్ వేస్తున్న దృశ్యం

ఏప్రిల్ నెలలో జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శ్రీసత్యసాయి జిల్లా విద్యాధికార్యాలయానికి చేరగా, వాటిని డిఇఒ మీనాక్షి ఆధ్వర్యంలో కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాలలోని కాన్ఫిడెన్షియల్ రూం నందు ఆదివారం భద్రపరిచారు. కలెక్టరేట్ తరపున డిఆర్ఓ కొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారిమీనాక్షి, పరీక్షల సహాయ సంచాలకులు నాగరాజుల ఆధ్వర్యంలో ఈ ప్రశ్నపత్రాలను భద్రపరచి సీల్‌వేశారు. ఈ మేరకు స్ట్రాంగ్ రూం వద్ద గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేశారు. జిల్లా వ్యాప్తంగా 125 పరీక్షా కేంద్రాలు ఉండగా, ఈ ప్రశ్నపత్రాలను వాటి పరిధిలోని పోలీస్ స్టేషన్‌లకు చేర్చి పరీక్షా సమయంకు ఒక గంట ముందు ప్రశ్నపత్రాలను సంబంధిత సెంటర్లకు పంపిణీ చేయడం జరుగుతుందని డిఇఒ తెలియజేశారు.

## లోకేష్ పాదయాత్రకు పల్లె సారథ్యంలో జనసమీకరణ

పుట్టపర్తిటౌన్, మార్చి 19, ప్రభాతవార్త :

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేస్ పాదయాత్ర ఈ నెల 21న పుట్టపర్తి నియోజకవర్గంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సారథ్యంలో బారీగా జనసమీకరణకు సన్నాహాలు సాగుతున్నాయి. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు,నాయకులు పార్టీ అభిమానులు లోకేష్‌కు స్వాగతంపలకడానికి తగిన కసరత్తులు చేస్తున్నారు. ముఖ్యంగా పల్లె అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటించి సమీకరణ బాధ్యతలను నాయకులకు అప్పగించడమేకాకుండా తాను కూడా స్వయంగా పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, అమడగూరు మండలాల్లో పర్యటిస్తూ వేలాది మందితో స్వాగతం పలకడానికి తగిన సన్నాహాలు చేపట్టారు. ప్రతి కార్యకర్త,నాయకులు ఈ పాదయాత్రను విజయవంతం చేయడానికి లోకేష్ పాదయాత్రలో అడుగులో అడుగు వేయడానికి సిద్ధమౌతున్నారు. ఆయా మండలాల నాయకులు కూడా జనసమీకరణకు గట్టిగా కృషి చేస్తున్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

- ఏపి ఎమ్మార్పిఎస్ నేతల డిమాండ్


కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పిఎస్ నాయకులు

పెనుకొండ, మార్చి 19 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం విజయవాడలో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఆ విగ్రహం పక్కనే డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయాలని ఏపి ఎమ్మార్పిఎస్ డిమాండ్ చేసింది. ఆదివారం పట్టణంలోని తెలుగు తల్లి కూడలిలో ఎమ్మార్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు ఆధ్వర్యంలో నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు కోసం దళిత గిరిజన సంఘాలతో ఈ నెల 24న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి మేధావులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఉద్యోగులు, మహిళాలు, 26 జిల్లాలను ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సింహులు, నారాయణ, పోతులయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మిఅరుణ చురుగ్గా ప్రచారం


బళ్లారిలో కేఆర్‌పీపీ అభ్యర్థి గాలి లక్ష్మిఅరుణ ప్రచారం చేపట్టిన దృశ్యం

బళ్లారి, మార్చి 19, ప్రభాతవార్త ; కళ్యాణరాజ్య ప్రగతిపక్ష పార్టీ నుంచి బళ్లారి సిటీ అభ్యర్థిగా గాలి జనార్దన్‌రెడ్డి సతీమణి గాలి లక్ష్మిఅరుణ నగరంలోని ఆయా ప్రాంతాల్లో చురుగ్గా ప్రచారం చేపట్టారు. ఆదివారంనాడు స్థానిక అంబేడ్కర్ కాంపౌండ్ ఏరియాలో స్థానికుల్ని కలిసి కలిసి తనకు ఓటువేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. గాలిజనార్దన్‌రెడ్డి ఆశయసాధనల కోసం ప్రత్యేకంగా కళ్యాణరాజ్యపక్ష పార్టీని స్థాపించారని, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం పట్టకుండా సొంత ప్రయోజనం కోసం రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారని, నిరుపేదల, బడుగువర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరుద్యోగ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే నేపథ్యంలో కేఆర్‌పీపీ నడుం కట్టిందని పేర్కొన్నారు. జిల్లా మంత్రిగా బళ్లారిలో గాలి జనార్దన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, బళ్లారి ప్రజలకు తెలుసునని, కేఆర్‌పీపీకి ప్రజలు మద్దతునిస్తే జిల్లా సమగ్ర అభివృద్ధి చేయడం ధ్యేయంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంలో స్థానిక మహిళలు, యువకులతో గాలి లక్ష్మిఅరుణ ఆప్యాయంగా ముచ్చటించారు. మీ ఇంటి ఆడపడుచుగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేయడం కనిపించింది. లక్ష్మిఅరుణ వెంట కేఆర్‌పీపీ సిటీ అధ్యక్షుడు జె.కిషోర్‌కుమార్, జి.సునీల్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు హంపీరమణ, నాయకులు ఉల్లాస్, పద్మ తదితర కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల బ్యానర్‌లు, ఫ్లెక్సీల తొలగింపుకు డి.సి.ఆదేశం


జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి

బళ్లారి, మార్చి 19, ప్రభాతవార్త ; 2023 సార్వత్రిక ఎన్నికలకు నియమావళి జారీ కానున్న నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి రాజకీయ పార్టీల ఓట్ల ప్రచారం, కులమత గలబాలు సృష్టించే బ్యానర్లు కానీ, హోర్డింగ్‌లు కానీ, కరపత్రాలు కానీ ముద్రించకూడదని, అటువంటివి కనిపిస్తే తక్షణం తొలగించాలని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి పవన్‌కుమార్‌మాలపాటి తెలిపారు. జిల్లాధికారి కార్యాలయం సభా భవనంలో జిల్లా ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులతో జరిగిన సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. రాజకీయ వ్యక్తులకు సంబంధించి బ్యానర్‌లు, ఫ్లెక్సీలు వారి వద్ద అధీకృత అనుమతి లేకుండా ముద్రించకూడదని, నిర్ణీత ఫారంలో సంతకాలు సేకరించిన అనంతరమే అటువంటి వాటిని ముద్రించాలన్నారు. ముద్రితమైన కరపత్రాలు మూడురోజుల్లో నాలుగుప్రతులు, ముద్రణకు ఖర్చుకు సంబంధించిన బిల్లుల వివరాలను ఎన్నికల అధికారి కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలని చెప్పారు. ఆదేశాన్ని ధిక్కరిస్తే తప్పనిసరిగా జరిమానా, జైలుశిక్ష విధించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశం మేరకు ప్లాస్టిక్ బ్యానర్‌లు, బంటింగ్స్, ఫ్లెక్సీలు, ఇతర ప్లాస్టిక్ ప్యాకింగ్ ఫిల్మ్ ఆహ్వాన పత్రికలు వినియోగించకుండా నిషేధం విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంలో జిల్లా పంచాయతీ సీఈఓ రాహుల్‌శరణప్ప, ఏడీసీ మహ్మద్‌జుబేరా, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

03ATP19_03ATP19.qxd 19-03-2023 PM 10:58 Page 1



# వర్షానికి దెబ్బతిన్న పండ్ల తోటలను పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు

## - ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపాము - జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథరెడ్డి

శింగనమల, మార్చి 19 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా శనివారం కురిసిన వడగళ్ల వర్షాలకు నష్టపోయిన రైతుల పంట పొలాలను, తోటలను ఆదివారం జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని పెద్ద జలాలపురం, సోదనపల్లి, శింగనమల, గోవిందరాయునిపేట, పెరవళి గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల పంట పొలాలను పరిశీలించారు. చీనీ-400 ఎకరాలు, సపోట-60, మామిడి 150 ఎకరాలు, దానిమ్మ 60 ఎకరాలు, పూత పిందె రాలడం వల్ల కలిగిన నష్టం అరటి 80, టమోట, బెండ, గోరు చిక్కుడు 50 ఎకరాలు, రైతులకు సంబంధించి నష్టపోయినట్లు ప్రాథమిక నివేదికలను పంపడం జరిగిందన్నారు. మరో వారం పాటు మండల మంతా వివరాలు సేకరిస్తామని ఆయన తెలిపారు. వారి వెంట సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి,



వర్షానికి నేలకొరిగిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న అధికారులు



జిల్లా ఉద్యాన శాఖ అధికారులతో చర్చిస్తున్న బొమ్మనశ్రీరామిరెడ్డి

వైకాపా సీనియర్ నాయకులు రమణారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి శైలజా, ఉద్యాన శాఖ సహాయకులు పవన్, అమరేష్, భార్గవి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రానికి చేరుకున్న పదో తరగతి ప్రశ్న పత్రాలు

అనంతపురం న్యూటౌన్, మార్చి 19 ప్రభాతవార్త

ఏప్రిల్ 3 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాలు ఆదివారం ఉదయం అనంతపురం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. మరికొన్ని ప్రశ్న పత్రాలు సోమవారం కూడా రానున్నాయి. ఈ ప్రశ్న పత్రాలను డీఈఓ సాయిరాం, ఏసి గోవిందనాయక్ స్వయంగా దగ్గర ఉండి కెవెఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 139 కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి 12:45 గంటల వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు 35,305మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను సోమవారం నుంచి పరీక్ష కేంద్రాల సమీపమున్న పోలీస్ స్టేషన్‌కు గట్టి బందోబస్తుతో తరలించనున్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ప్రశ్న పత్రాలను దగ్గర ఉండి పోలీస్‌స్టేషన్‌లో భద్ర పరచాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కావలసిన అన్ని మౌలిక వసతులు ఉన్నాయా..? లేదా.. అని ముందుగానే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని డిఇఓ ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా పరీక్షలు ఏర్పాట్లపై ఏసిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆఫీస్ పర్యవేక్షకులు సరళకుమారి, ఏపిఓలు నారాయణస్వామి, నాగరాజు, పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షానికి దెబ్బతిన్న పొలాలను పరిశీలించిన ఏడిఏ నారాయణనాయక్



వర్షానికి దెబ్బతిన్న మొక్క జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది



వరిపైరును పరనిశీలిస్తున్న ఏడిఏ నారాయణ నాయక్

శింగనమల, మార్చి 19 ప్రభాతవార్త

అకాల వర్షానికి మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆదివారం గుత్తి ఏడిఏ నారాయణ నాయక్ పరిశీలించారు. మండల పరిధిలోని పెరవళి, శింగనమల, ఆకులేడు, కొరివిపల్లి, చక్రాయుపేటలలో వరి పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి 1290 ఎకరాలు, మొక్కజొన్న 282 ఎకరాలు, గ్రౌండ్‌నట్ 30 ఎకరాలు, ఆమిదం పంట 10 ఎకరాలు మొత్తం మండల వ్యాప్తంగా 1612 ఎకరాలు డ్యామేజ్ ప్రాథమికంగా నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని, వారం రోజులపాటు మండల వ్యాప్తంగా అన్ని పొలాలను పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి పంపుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చిన్నమ్మ, ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది పవన్, అమరేష్, భార్గవి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌ను కలిసిన బ్యాళ్ల నాగేంద్ర

శింగనమల, మార్చి 19 ప్రభాతవార్త

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఆదివారం సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో ప్రవేశించగా నారా లోకేష్‌కి స్వాగతం పలికేందుకు శింగనమల నియోజకవర్గం బిసి నాయకుడు బ్యాళ్ల నాగేంద్ర స్వయంగా వెళ్లి ఆయనను కలిసి శ్రీభక్త కనకదాసు చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో బిసిల గురించి అదే విధంగా కురుబలు తెలుగుదేశం పార్టీ వైపు పని చేసే విధంగా ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలని చర్చించడం జరిగిందన్నారు.



నారా లోకేష్‌కు కనకదాసు చిత్రపటాన్ని బహుకరిస్తున్న బిసి నాగేంద్ర

## .రైతన్నకు అండగా ఉంటాం - సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి



మొక్క జొన్న పంటలను పరిశీలిస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న జడ్పిటిసి కంచి రెడ్డి సుధ

.శింగనమల, మార్చి 19 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మనశ్రీరామిరెడ్డి, జడ్పిటిసి కంచి రెడ్డి సుధ, వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద జలాలపురం, గోవిందరావుపేట, శివపురం, శింగనమల గ్రామంలో పర్యటించి ధైర్యంగా ఉండండి రైతన్నకు అండగా జగనన్న ఉంటారని, ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందే విధంగా రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా ముఖ్య నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు ఎన్‌వి.నారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## బొప్పాయి తోటలను పరిశీలించిన సర్పంచు మల్లెల సుభాషిని

.శింగనమల,

మార్చి 19 ప్రభాతవార్త

అకాల వర్షాలకు మండల పరిధిలోని మల్లేపల్లిలో దెబ్బ తిన్న బొప్పాయి పంటలను ఆది వారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపి విద్యా సలహా దారులు ఆలూరు సాంబ శివారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు బొమ్మన శ్రీరామిరెడ్డి ఆదేశాల మేరకు ఆకులేడు గ్రామ సర్పంచు మల్లెల సుభాషిని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంటనే పంట నష్టపోయిన పంటల విరాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశజంచారు. ఆమె వెంట వైకాపా మండల నాయకులు మల్లెల రామాంజినేయులు మల్లెల మురళీ, ఎం.భాస్కర్, నారాయణస్వామి, ఉపసర్పంచు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



వడగండ్ల ధాటికి నేలకొరిగిన బొప్పాయి మొక్కలను పరిశీలిస్తున్న దృశ్యం

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన టిడిపి నాయకులు

నార్పల రూరల్,

మార్చి 19 ప్రభాతవార్త

మండలంలోని వెంకటాంపల్లి, గడ్డంనాగేపల్లి, పులసలనూతలతో పాటు పలు గ్రామాల్లో భారీగా కురిసిన వడగండ్ల వానకు దెబ్బ తిన్న అరటి, బొప్పా యి, మొక్క జొన్న, వరి, తదితర పంటలను ఆదివారం టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకటనర సానాయుడు పరిశీలించారు. కొన్ని వందల ఎకరాల్లో చేతికి వచ్చిన పంట పూర్తిగా నేలపాలైందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న పంట పొలాలను అధికారులు పరిశీలించి రైతులకు నష్టప రిహారం ఎకరాకి మూడు లక్షల రూపాయలు చొప్పున అందచేయాలన్నారు. కరోనా సమయంలో పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోయారని, ఇప్పుడు ధర బాగుంది ఇప్పుడైనా పెట్టుబడి పోయి కాస్తో కూస్తో పంట చేతికి వస్తుదను కుంటే ఇలా అకాల వర్షం కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత చంద్రబాబు, పులసలనూతల కాటమయ్య, జగదీష్, కేశేపల్లి నాగేంద్ర, నల్లపరెడ్డిపల్లి గోవర్ధన్, చక్రవర్తి, మహేష్, హరీష్, వడ్డే మహేష్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



అరటిపంటను పరిశీలిస్తున్న ఆలం వెంకటనరసానాయుడు

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా - షేక్ గైబువల్లి

అనంతపురం న్యూటౌన్, మార్చి 19 ప్రభాతవార్త

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తను ఓడినా కూడా ఎల్లప్పుడూ విద్యావంతుల, నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రజా సమస్యలపై నిరంతరం అందుబాటులో ఉండి పోరాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చస్తానని, తనకు ఎ మ్మెల్సీ ఎన్నికలలో సహకరించి సహాయ సహకారాలు అందించిన వారికి, తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు షేక్ గైబువల్లి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు .రాష్ట్రంలో మూడు పట్టభద్రుల స్తానాలను గెలుపొందిన తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి, తెలుగుదేశంపార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు.



షేక్ గైబువల్లి

## ఆపదవేళ స్నేహహస్తం

నార్పల రూరల్,

మార్చి 19 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచి తమ స్నేహ బంధాన్ని చాటుకున్నారు. మండలంలోని దుగుమర్రి గ్రామానికి చెందిన నరసింహులు గత వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నరసింహులు స్వగ్రామంలో కూలి పని చేసు కుంటూ జీవనం సాగించేవాడు. మృతునికి భార్యతో పాటు నలుగురు పిల్లలు వున్నారు. గత వారం రోజుల క్రితం వ్యక్తిగత పని నిమిత్తం పుట్లూరు మండ లం మడుగుపల్లికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మిత్రుని కుటుంబ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి చిన్ననాటి నుండి అతనితో పాటు కలిసి చదువుకున్న 2002-03 సం వత్సరంలో నార్పల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన మిత్రులు సహాయం అందించారు. మిత్రుని కుటుం బస భ్యులకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. భవిష్యత్తులోను తమ మిత్రుని కుటుంబానికి అండగా వుంటామని వారు తెలియచేశారు.



ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యం

## శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో సరస్వతీ పూజ

అనంతపురం న్యూటౌన్,

మార్చి 19 ప్రభాతవార్త

స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏజిఎం సుబ్బారెడ్డి భక్తి శ్రద్దలతో సరస్వతి పూజ ప్రారంభించారు. 10వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతాయి. కావున విద్యార్థులు పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లా డుతూ.. సరస్వతి దేవి కటాక్షం లభించాలంటే ప్రతి విద్యార్థి కష్టప డుతూ చదువుల తల్లి సరస్వతి దేవిని స్మరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, సుమీనా ఖానం, విశ్వనాథ్ పర్వీన్ నేత్రావతి శాంతా, శ్రీదేవి, దీన్లు రిషిబాల, అప్పలనాయుడు, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ ప్రైమరీ ఇన్‌చార్జ్ భారతి, నీరజ, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ రమణ, ఏఓ గోపాల్, క్యాంపస్ ఇన్‌చార్జ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

## జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సర్వ సభ్య సమావేశం

అనంతపురం కల్చరల్,

మార్చి 19 ప్రభాతవార్త

జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక విద్యుత్ కళాభారతిలో ఆ సంఘం గౌరవ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఎవి.కిరణ్, కంపెనీ అధ్యక్షులు ములక గంగన్నలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 300 మంది సభ్యులు పాల్గొన్నారు. నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా చింతలయ్య, జిల్లా కార్యదర్శిగా మల్లెల శ్రీనివాస్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెఆర్‌ఎస్ ధర్మజ్ఞాని, సిజిఎం కొమ్ము సంపత్‌కుమార్, ఎస్‌ఈ/ఆపరేషన్/ఆదిలాబాద్, సురేంద్ర, ఎస్‌ఈ/ఆపరేషన్/ అనంతపురం, టి.జయ రామయ్య, ఎస్‌పిడిసిఎల్, డిస్కమ్ సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం దృశ్యం

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

శింగనమల, మార్చి 19 ప్రభాతవార్త

అకాల వర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అనంతపురం తెలుగుదేశం పార్టీ అధి కార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ అకాల వర్షాలతో నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర నష్టం కలిగి oదని, ముఖ్యంగా వరి, మామిడి, దానిమ్మ, సపోట వంటి పంటలకు తీవ్ర నష్టం కలిగిoదని వెంటనే ప్రభు త్వం స్పందిం చిపంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వా లని ఆయన డిమాండ్ చేశారు.



దేగల కృష్ణమూర్తి

# ఎస్సీ స్మశానవాటీకకు మట్టీ రోడ్డు ఏర్పాటు

## కట్టకిందపల్లి గ్రామ సర్పంచ్ భోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డి.

అనంతపురం రూరల్,మార్చి 19 ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలం కట్టకిందపల్లి గ్రామ పంచాయితీలో నివాసించే ఎస్సీ కాలనీ ప్రజల స్మశానవాటీకకు రాకపోకలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతుండంతో వారు ఇబ్బందులు పడకుడదనే ఉద్యశ్యంతో స్మశానవాటీకకు పోవు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించి మట్టీ రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని కట్టకిందపల్లి గ్రామ సర్పంచ్ భోనగిరి శోభ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021 ఎన్నికల సమయంలో గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రజల స్మశానవాటీకకు పోవుటకు మట్టీ రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఇచ్చిన హామీ మేరకు ఆదివారం కట్టకిందపల్లి పంచాయితీలోని ఎస్సీ స్మశాన వాటీకకు పోవు రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరుకుపోవడంతో పెరిగిన కంప చెట్లను జెసిబితో శుభ్రం చేయిం చడంతో పా టు స్మశాన వాటీకకు పోవు ఎస్సీ ప్రజలు ఏలాంటీ సమస్య రాకుండ స్మశాన వాటీకకు పోవు దారి మొత్తం మట్టీ రోడ్డు వేయించి ఎస్సీ ప్రజలకు ఎటువంటీ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మి కులు,తదితరులు పాల్గొన్నారు.



మట్టీ రోడ్డు వేయిస్తున్న సర్పంచ్ భోనగిరి శోభ వరప్రసాద్ రెడ్డి

## ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించిన ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, మార్చి 19 ప్రభాతవార్త

అనంతపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపొందినటువంటి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని తెలుగుదేశంప ఆర్టీ శింగనమల నియోజకవర్గం ద్విస భ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి ఘనంగా సత్కరించారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు పూల మాలలు బొకేలు శాలువాలతో సత్కరిస్తూ కేకులు కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు రామలింగారెడ్డి, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఇల్లూరు రామాంజి నేయు లు, టిఎన్‌టియుసి బాబయ్య, మండల తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాథ్ నాయుడు, కన్వీనర్ పాండు సుధాకర్‌రెడ్డి, తెలుగు దేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

## ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి బాబయ్య

గార్లదిన్నె, మార్చి 19 ప్రభాతవార్త

గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన టిడిపి నాయ కులు టిఎన్‌టియుసి జిల్లా అధికార ప్రతినిధి బాబయ్య నూతనంగా ఎన్నికైన రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అనంతపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి పూల బొకే శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలియజేస్తున్న బాబయ్య

## యువగళం పాదయాత్రలో మైనార్టీ కార్యదర్శి

ఓబుళదేవరచెరువు, మార్చి 19, ప్రభాతవార్త : టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో పుట్టపర్తి నియోజకవర్గ మైనార్టీ కార్యదర్శి గండికోట ఇర్షాద్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు మండలంలో నారా లోకేష్‌తో కలిసి ఆయన పాదయాత్ర సాగించినట్లు తెలియచేశారు. పాదయాత్రకు మండలం నుండి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు తెలిసింది.



నారా లోకేష్‌తో ఇర్షాద్

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంతో కొండకమర్లలో సంబరాలు

ఓబుళదేవరచెరువు, మార్చి 19, ప్రభాతవార్త : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విజయం సాధించడం పట్ల మండల ంలోని కొండకమర్లలో ఆదివారం టిడిపి శ్రేణులు బాణా సంచా పేల్చి, మిఠాయి లు పంచి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు ఘన నివాళులు అర్పించారు. రాంగోపాల్‌రెడ్డిని గెలిపించిన పట్టభద్రులకు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

## ఉగాది పురస్కారం అందజేత

కదిరి, మార్చి 19 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రకృతిని పెంచి జిల్లా నుంచి కరువును పారద్రోలాలన్న ఉద్దేశ్యంతో పని చేస్తున్న శ్రీజి ప్రకృతి ధర్మపీఠం జిల్లా అధ్యక్షునికి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. శ్రీజి ధర్మపీఠం ట్రస్టు వారు 2023 ఉగాది పురస్కారాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపి చంద్ చేతులు మీదుగా జిల్లా ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో శరత్‌కుమార్‌రెడ్డికి అందజేసి దుశ్శాలువాతోఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కోఆర్డినేటర్ వెంకటేష్‌లు పాల్గొన్నారు.



పురస్కారాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

## ఘనంగా మదరస్సా రబ్బానియా వార్షికోత్సవాలు

కదిరి, మార్చి 19 ప్రభాతవార్త

కదరి మున్సిపల్ పరిధిలోని జెండామాను వీధిలో ఉన్న మదరస్సా రబ్బానియా వార్షికోత్సవాలను కార్యదర్శి హాజీ అత్తారు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా మౌలానా అబ్దుల్ రెహమాన్ హాజరయ్యారు. మదరసాలు అరబ్బిక్ ఉర్దు, ఖురాన్ పఠనమే కాక ఇతర ప్రపంచిక విజ్ఞానాన్ని నేర్పిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మదరస కమిటీ మెంబర్లు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముఖ్య అతిథి మౌలానా అబ్దుల్ రెహమాన్

## పంట ఋణాల రెన్యువల్‌లో మార్పులు చేయండి - రైతు సంఘం నాయకులు

తనకల్లు, మార్చి 19, ప్రభాతవార్త:

పంట ఋణాల రెన్యువల్‌లో మార్పులు చేయాలంటూ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంటలు పెట్టుబడులు భారీగా ఖర్చులు అవుతున్నాయని, ప్రస్తుతం భూమి విలువ ఎకరా రూ. 10లక్షల దాకా అమ్ముతున్నాయని బ్యాంక్ వారు ఎకరాకు రూ. 50వేల రూపాయలు ఇవ్వాలని, ఈ చట్ట ప్రకారం రెన్యువల్ చేసుకొని అవకాశం కల్పించాలని, తక్కువ ఋణాలు ఇచ్చి రెన్యువల్ చేయాలంటే రైతులందరి సహకారంతో బ్యాంక్ ఎదుట ధర్నాలు,రిలే నిరాహార దీక్షలు చేపడుతామన్నారు. మా డిమాండ్‌లు ప్రతి ఎకరాకు రూ. 50వేల రూపాయలు తగ్గకుండా పంట ఋణాలు ఇవ్వా లన్నారు. పెద్దకారు రైతులకు రూ. 4లక్షలు పూచికత్తు లేని ఋణం ఇవ్వా లని అర్హత కలిగిన రైతులందరికీ కొత్త పంట ఋణం ఇవ్వాలని రెన్యువల్ గడువు ఆగష్టు 30 దాకా పెంచాలని,బ్యాంక్‌లో తగు సిబ్బంది పెట్టి సకాల ంలో రైతులందరికీ రివ్యూలు చేయాలని బ్యాంక్‌లలో కస్టమర్లకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, బ్యాంక్ వ్యవస్థలో కొంతమంది బ్రోకర్లు కడుపు నింపుకుంటున్నారని అలాంటి వారిని బ్యాంక్‌లలో అనుమతించరాదని రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, ఎం.శివన్న,వివి రమణ, ఎస్వి రమణ, చలపతి, శ్రీనివాసులు, అశోక్ కుమార్, లోకేశ్వర్‌రెడ్డి, రైతులు తెలిపారు.



ఎస్‌వి రమణ

## నాయకులు హౌస్‌అరెస్ట్

పెద్దపప్పూరు, మార్చి 19 ప్రభాతవార్త

సిపిఐ ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి రాష్ట్ర సిపిఐ పిలుపు నివ్వడంతో పోలీసులు ముందస్తుగా మండలంలోని సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, సిపిఐ సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, మాజీ సర్పంచు, టిడిపి నాయకుడు సం దాచి తమ్మిరిని ఆదివారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, జిఒ నెంబర్-1 తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయకపోతే తీవ్రమైన ఉద్యమం చేపడతామని, హౌస్ అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే సహించే దిలేదని సిపిఐ నాయకులు చింతా పురుషోత్తం పేర్కొన్నారు.



చింతా పురుషోత్తంకు నోటీసు అందచేస్తున్న దృశ్యం

## పూర్వ విద్యార్థుల అపూర్వసమ్మేళనం

పెద్దపప్పూరు,

మార్చి 19 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఆనందం వ్య క్తం చేశారు. ఆటపాటలతో గడిపాడు. చాగల్లు గ్రామానికి చెందిన రఫీ, గార్లదిన్నె కమలాకర్‌రెడ్డి, అమర్ నాథ్‌రెడ్డి కృషితో ఆదివారం అలనాటి గురువులను విద్యార్థులను పాఠశాల వేదికగా ఐక్యం చేశారు. అనంతరం ఆనాడు పాఠాలు చెప్పిన గురువులు నేడు జీవిత పాఠాలను నేర్పుతూ ప్రసంగించారు. గురువుల ఆశీర్వాదంతోనే నేడు కష్టసుఖాల కలబోతతో జీవితంలో ఎదుగుతూ సుఖంగా వున్నామని నాటి విద్యార్థులు ప్రసంగించారు. అనంతరం నాటి విద్యార్థులు అప్పటి ఉపాధ్యా యులైన సుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, మాధవ, రంగస్వామి, రమణారెడ్డి, శ్రీదేవి, సంధ్యారాణి, సరిత, రాణి, శ్రీలత, మురళీకృష్ణ, ఆంజనేయప్రసాద్, మల్లీశ్వరిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, శ్రీరంగారెడ్డి, రామకృష్ణ, వెంకటే శ్వర్లు, ఫరూక్, అబ్దుల్లాతో పాటు దాదాపు 80 మంది ఆనాటి విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన నాయకులు

పుట్లూరు, మార్చి 19 ప్రభాతవార్త

మండలంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలను వైసిపి, టిడిపి, బిజెపి, సిపిఐ, సిపిఎం, రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కడవకల్లు, ఓబులాపురం, మడ్డిపల్లి, చెర్లోపల్లి, కుమ్మనమల, చాలవేముల, కోమటికుంట్ల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడగండ్ల వర్షానికి వేలాది ఎకరాల్లో పండ్లతోటలు దెబ్బతిన్నాయ న్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేయాలని వారు తెలి యచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంపిపి రాఘవరెడ్డి, మూలి వెంక టరామిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌నాయుడు, పెద్దయ్య, రామాంజి, సూరి, గోపాల్, శ్రీనివాసులురెడ్డి, రామాంజియాదవ్, తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

## లీలావతి వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి, మార్చి 19 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని లీలావతి వృద్ధాశ్రమంలో ఆదివారం రామదాసు కోడలు జగిలేటి వాసంతి జన్మదినాన్ని పురస్క రించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించినట్లు ఆశ్రమ నిర్వాహ కురాలు పరిమి కృష్ణవేణి తెలిపారు. కీర్తిశేషులు రామదాసు కుమారుడు రమణ, కోడలు వాసంతి ఇరువురు ఆశ్రమానికి వచ్చి అన్నదానంతో పాటు వృద్ధులకు చీరలు, పంచలు, తదితర దుస్తులు పంపిణీ చేసినట్లు ఆశ్ర మ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి, విక్రమ్ లు తెలిపారు. అనంతరం వాసంతి రమణ దంపతులను వృద్ధులు ఆశీర్వదించారు.



వృద్ధురాలికి దుస్తులు అందచేస్తున్న దృశ్యం

## విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

ఓబుళదేవరచెరువు, మార్చి 19, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆకుతోటపల్లిలో ఆదివారం విద్యుత్ షాక్ పాడి ఆవు మృతి చెందినట్లు బాధితుడు చాకలి శంకర తెలిపాడు. ఉదయాన్నే గడ్డిమేసేందుకు ఆవును గ్రామ సమీపంలోని పొలాల్లోకి తీసుకువెళ్లానన్నారు. ఇదే క్రమంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద ఆవు గడ్డి మేస్తుండగా స్టే వైరుకు తాకడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందిందన్నాడు. ఆవు మృతితో జీవనాధారం కోల్పాయానని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు బోరున విలపించాడు.

## నెహ్రూ యువకేంద్రంచే యువజనోత్సవం

బళ్లారి, మార్చి19, ప్రభాతవార్త ;

బళ్లారి నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఆంటోనీహాల్‌లో ఏర్పాటు చేసిన యువజనోత్సవం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. దేశానికి వెన్నెముకగా ఉన్న రైతుల తర్వాత యువకులు ఈ దేశం శక్తిగా ఉన్నారని, నవసమాజం నిర్మాతలుగా యువతీ యువకులు నడుం కట్టి విద్య, ఉద్యోగ, సాంకేతిక, ఉపాధి రంగాల్లో రాణించాలని, ఇందుకోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో అభివృద్ధి పథంవైపు యువకులు నడవాలని పిలు పునిచ్చారు. సమాజంలో యువకుల పాత్ర అత్యంత కీలకమైనదని, భారత దేశ పౌరులుగా అన్నిరంగాల్లో మెళుకువలు సాధించి, దేశం అభివృద్ధికి చేయూతనందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిశప్‌డిసౌజా మాట్లాడుతూ నెహ్రూ యువకేంద్రం యువతీ యువకులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. కుల, జాతి, మత బేధాలు ఏవీ లేకుండా కలిసి మెలిసి ఉండడం నేటి యువతరంలో కనిపిస్తున్నదని, ఇది వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు దోహద పడుతుందని చెప్పారు. తమ జీవనమార్గాన్ని ఎంచుకునే శుభతరుణం యుక్త వయస్సే నని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగపరుచుకుని, భారతదేశం ఖ్యాతిని ఖండాంతరాలు దాటి ప్రపంచదేశాలకు చాటి చెప్పాలని, విదేశాల్లోనూ దేశం గొప్పతనాన్ని చాటి చెప్పాలన్నారు. ఈ సందర్భంలో కేఎంఎఫ్ డైరెక్టర్ వీరశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌మోత్కర్, మల్లన్నగౌడ, మేయర్ రాజేశ్వరి, అబ్రహం, నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ మాంటుపతార్ తదితరులు పాల్గొన్నారు.



యువ ఉత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి

04ATP19_04ATP19.qxd 19-03-2023 PM 10:48 Page 1



# పట్టభద్రులు, మేధావులు సరైన తీర్పు ఇచ్చారు

## - టిడిపికి ఇంత ఆదరణ చూపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు - ఈ గెలుపు వైసిపి పతనానికి నాంది పలికింది - ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై మాజీ మంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ మం త్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు

అనంతపురం, మార్చి 19 ప్రభాతవార్త బ్యూరో

.వైసిపి నాయకులు ఎంత ప్రలోభ పెట్టినా.. బెదిరించాలని చూసినా పట్టభద్రులు, మేధావులు ఎంతో విజ్ఞతతో తమ తీర్పు ఇచ్చారని మాజీ మం త్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయం సాధిం చిన రాంగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ..

తాము మొదటి నుంచి ఈ విషయం ఊహి ంచామని, కానీ వైసీపీ ప్రలోభాలు ఎక్కడైనా పని చేస్తాయా అన్నది ఒక ఆలోచన ఉండేదన్నారు. పట్టభద్రులైతే వైసీపీ నేతలు ఎంత ప్రలోభ పెట్టినా టిడిపికి ఓటు వేసి సరైన తీర్పు ఇచ్చారన్నారు. ఈ తీర్పుతో వైసీపీ పతనానికి నాంది పలకడంతోపాటు వ చ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడ పి విజయానికి శ్రీకారం చు ట్టిందన్నారు. ఈ రెండు నెల లుఎంతో కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకుడికి వారు కృతజ్ఞతలు తెలిపా రు. ఈ విజయం స్ఫూర్తితో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని, వారు పిలుపునిచ్చారు.

# జగన్ సొంతగడ్డపై భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి విజయ దుందుబి

## - ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ సత్తా చాటిన వైనం - రాయలసీమలో టిడిపిలో జోష్ నింపిన ఎమ్మెల్సీ ఎన్నికలు - ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు టిడిపి ఇన్‌చార్జులు - టిడిపిలో అంబరాన్ని అంటిన సంబరాలు



ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి







సంబరాలు చేసుకుంటున్న టీడీపీనేతలు

అనంతపురం అర్బన్, మార్చి 19 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో ఎమ్మెల్సీ ఎన్నికల నగరా మోగింది. దాదాపు 12 ఎమ్మె ల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీకాగా అం దులో ఆరు ఎమ్మెల్సీ స్థానాలు స్థానిక సంస్థల కోట కింద ఏకగ్రీవం అయ్యాయి. అందులో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 3 పట్టభద్రుల స్థానాలకు, మరో 3 ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలో 3 ఉపాధ్యాయ స్థానాల్లో వైసిపి పార్టీ విజయం సాధించింది. అయితే మూడు ఉపాధ్యాయ స్థానాల్లో అతి తక్కువ మెజార్టీతో వైసిపి అభ్యర్థులు బయటపడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎప్పుడు లేని విధంగా ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఓటు వేయడానికి ప్రభుత్వం అను మతించడంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ పార్టీ విజయం సాధించిందని లేకపోతే ఈ మూడు ఎమ్మెల్సీ స్థానాలు కూడా టిడిపికి దక్కేవని పలువురు విశ్లేషిస్తున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు పలు రకాలుగా తాయిలాలు ప్రకటించి డబ్బులు కూడా భారీ మొత్తంలో ఓటర్లకు అందజేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. వీటివల్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిల్లో వైసిపి విజయం సాధించిందని అంటున్నారు. టీడీపీ మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయం నమోదు చేసుకుంది. తూర్పు పట్టబద్రుల, పశ ఇచమ పట్టభద్రులు కోస్తాంధ్రలో ఎమ్మెల్సీ ఎన్నికలోల విజ యధంకా మోగించింది. ముఖ్యంగా పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల ఎన్నికల్లో కడప జిల్లా పులివెందులకు చెందిన భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి 7543 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ముఖ్యంగా కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాల మాజీ ఎమ్మెల్యేలు, టిడిపి నియోజ కవర్గ ఇన్‌చార్జులు, మాజీ ఎంపిలు, మాజీ ఎమ్మెల్సీలు మండల స్థాయి నాయకులు, పంచాయితీ స్థాయి నాయకులు, గత నెలలో నుంచి క్షే త్రస్థాయిలో పని చేస్తూ పట్టభద్రులను చైతన్య పరుస్తూ ఎమెల్సీ విజయం కోసం అహర్నిశలు కృషి చేసినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు కాలవ శ్రీనివా సులు, పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, అనంతపురం అర్బన్ ఇన్‌చార్జ్ వైకుంఠం ప్రభాకర్ చౌదరి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి, మాజీ ఎమ్మెల్సీలు ఉన్నం హను మంతరాయ చౌదరి, ఈరన్న, జితేంద్ర గౌడ్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, నియోజకవర్గ ఇన్‌చార్జులు పరిటాల శ్రీరామ్, బండారు శ్రావణిశ్రీ, ఉమామహేశ్వర నాయుడు, అస్మి త్‌రెడ్డి, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసనాయుడు, ముంటి మడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిలు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, రామ్మో హన్‌చౌదరి, జెఎల్ మురళీ, బుగ్గయ్య చౌదరి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సునీతమ్మ, ఇతర నేతలు ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి విజయానికి సమిష్టిగా పని చేసినట్లు తెలిసింది. దీంతో భూమ ఇరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవడానికి దోహదపడ్డాయి. అనంతపురం జిల్లాలో నాలుగు సంవత్సరాల తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ విజయంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబ రాన్నంటాయి. స్థానిక మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాజీ మంత్రి పరి టాల సునీత, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, శింగనమల టిడిపి ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటరామిరెడ్డి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే



భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 19 ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు,టెక్నికల్ అసిస్టెంట్ సిద్దికూటి వెంకటరామిరెడ్డి మృతితో మంచి అప్తుడుని కోల్పోయానని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు.ఆత్మకూరుకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి నిన్నటి రాత్రి మండల పరిధిలోని పంపనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు.ఆదివారం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ఆత్మకూరుకు వెళ్లి వెంకటరామిరెడ్డి భౌతికాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళు అర్పించారు. మెదటగా ప్రమాద స్థలాన్ని పరిశీలించి ఘటన ఎలా జరిగిందని ఆరా తీశారు.మా కుటుంబానికి చాలా సన్నితంగా ఉండేవాడని ఎమ్మెల్యే కొనియాడారు.మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఆయన లేని లోటును తీర్చలేమని,వారి కుటుంబానికి తమవంతు సహకారం అంది స్తామన్నారు. మండలం లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతిని తెలియ జేశారు.

# జననేతకు జనం నీరాజనం

## - అడుగడుగునా నారా లోకేష్‌కు అపూర్వ స్వాగతం - 47వ రోజు కొనసాగిన యువగళం పాదయాత్ర



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నారా లోకేష్, కందికుంట

కదిరి/నల్లచెరువు, మార్చి 19 ప్రభాతవార్త

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి జననేత నారా లోకేష్‌కు అడుగడుగునా జన ఆధరణ పెరగడంతో మహిళలు, వృద్దులు హారతులు ఇచ్చి అండగా నిలిచారు. 47వ రోజైన ఆదివారం నల్లచెరువు మండలం చిన్నపల్లోళ్ల పల్లి నుంచి లోకేష్ పాదయాత్ర ఉదయం 9.45 గంటలకు ప్రారంభమైంది. సంజీవపల్లి, దేవిరెడ్డిపల్లి, పెద్దయల్లంపల్లి మీదుగా నల్లచెరువు మండల కేంద్రానికి పాదయాత్ర చేరుకుంది. నల్లచెరువు మండల కేంద్రంలో చేనేతలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తెలుగుదేశ ంపార్టీ అధికారంలోకి వస్తే చేనేతలకు అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. 12:30 గంటలకు భోజన విరామంతో తిరిగి 2.45 గంటలకు పాదయాత్ర పాత రైల్వే స్టేషన్ మీదుగా రాత్నాలపల్లి కొనసాగింది. అక్కడ కురుబ కులస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్న పల్లోళ్లపల్లి వద్ద యువగళం పాదయాత్ర 600 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా మైలు రాయిని నారా లోకేష్, టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంటలు ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి స్వాగతం పలికారు. అందరికీ అభివాదం చేస్తూ లోకేష్ ముందుకు వెళ్లా రు. పాదయాత్ర తర్వాత సాయంత్రం 5 గటలకు జోగ న్న పేట వద్ద నిర్వహించిన బహి రంగ సభలో నారా లోకే ష్ పాల్గొన్నారు. ఈ కార్యక్ర మం లో మాజీ మంత్రి కాలవ శ్రీని వాసులు, కొల్లు రవీంద్ర, అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మె ల్సీ అత్తారు చాంద్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వర నాయుడు, టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అకాల వర్షం నివేదికలు త్వరితగతిన పూర్తి చేయండి - ఎమ్మెల్యే సిద్దారెడ్డి



సమావేశంలో మాట్లాడు తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి, మార్చి 19 ప్రభాతవార్త

గత రెండు రోజులుగా వడగండ్లు, అకాల వర్షం కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంట నష్ట నివేదికలను త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులకు కదిరి ఎమ్మెల్యే డా.పి.వి.సిద్దారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న గృహాలను గుర్తించి నష్టపోయిన బాధితులకు పరిహారం అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు మీ పరిసర ప్రాంతాల్లో వర్షానికి నష్టపోయిన బాధితుల వివరాలను అధికారు లకు అందజేసి ప్రభుత్వ సాయం అందే విధంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు తమప్ర భుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# చంద్రబాబుతో మాట్లాడాల్సిన అవసరం మీకేముంది

## - కౌంటింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో హాజరైన చర్యలు లేవా..? - నిష్పక్షపాతంగా వ్యవహరించని జిల్లా కలెక్టర్‌పై ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తాం - వైసిపి నేత వెన్నపూస రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న వైసిపి నేత వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం సిటీ, మార్చి 19 ప్రభాతవార్త

ఎన్నికల విధులలో పార్టీలకు దూరంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ కౌంటింగ్ సమయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుతో మాట్లాడాల్సిన అవసరం ఏముందని వైసిపి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన వైసీపీ నేత వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రశ్నించారు. జిల్లా వైకాపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగినప్పటికీ కౌంటింగ్‌ప్రక్రియలో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా కనిపించాయన్నారు. ఎన్నికల కౌంటింగ్ విధులకు హాజరైన సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి తాము ప్రభుత్వానికి వ్యతిరేకమన్న సంకేతాన్ని ప్రతిపక్షాలకు స్పష్టంగా తెలియజేస్తూ, తమను వాడుకోవచ్చంటూ ప్రతిపక్షాలకు ప్రత్యక్షంగా తెలియజేసేలా వ్యవహరించారని, ఇదే అంశాన్ని తాము ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా వారిపై చర్యలు తీసుకోకపోవడమే కాకుండా తాము చేసిన ఫిర్యాదును పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. అదే విధంగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్య నేతలు స్వతంత్ర్య అభ్యర్థుల తరుపున ఏజెంట్లుగా వ్యవహరించారని తద్వారా గతంలో వారి ద్వారా లబ్ది పొందిన అధికారులను ప్రత్యక్షంగా వారు ప్రభావం చూపే అవకాశం ఉందని, ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లినా పట్టి పట్టనట్లు ఉన్నారని, ఒకే పార్టీకి చెందిన వారికి అన్ని పాసులు ఎలా కేటాయించారని, ఆయన ప్రశ్నించారు. అదే విధంగా తమ పార్టీ ద్వారా 24 మందికి కౌంటింగ్ పాసులు జారీ చేశారని, తొలి రోజు కౌంటింగ్‌లో టీడీపీ నేతలు దౌర్జన్యంగా వ్యవహరించి తమ పార్టీ అభ్యర్థుల కౌంటింగ్ పాసులు చించి వేశారని, చించివేసిన పాసుల స్థానంలో రీప్లేస్ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా రెండు రోజులపాటు కౌంటింగ్‌పాసులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. దీంతోపాటు దమ పార్టీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్యకు రీ ప్లేస్ పాసులో అవకాశం కల్పించాలని కోరినా కలెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహాఱించారని ఆయన ఆరోపించారు. కౌంటింగ్‌కేంద్రంలో టీడీపీనేతలు దౌర్జన్యం చేశారని, అయినప్పటికీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి వైసీపీ నేతలు దౌర్జన్యం చేశారని, ఫోన్‌లో మాట్లాడారన్నారు. జిల్లా ఎన్నికల అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ ఒక పార్టీ నేతతో ఏ విధంగా కౌంటింగ్ సమయంలో ఫోన్‌లో మాట్లాడుతారని ఆయన ప్రశ్నించారు. కేవలం ప్రజలు నైతికతతో వేసిన ఓట్లను ప్రభావితం చేసేలా జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ వ్యవహరించారని ఆయన ఆరోపించారు. అదే విధంగాకౌంటింగ్‌కేంద్రంలో తనకు వచ్చిన ఓట్లను టిడిపి ఓట్లతో కలిపి బండిల్స్‌గా మార్చారని ఇదే విషయాన్ని తాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తప్పు జరిగింది సరిదిద్దుతామని పేర్కొన్నారన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తనకు అనుకూలంగా మెజార్టీ వచ్చిందని, అయితే మూడు నాలుగు ఐదు ఆరు రౌండ్లలో అక్రమాలు జరిగాయని బండిల్ రీ వెరిఫికేషన్ చేయాలని తాను పదేపదే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా వాటిని సరిదిద్దే దిశగా ఆమె చర్యలు తీసుకోక పోగా ఎవరికో మేలు చేసేలా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఎన్నికల కౌంటింగ్ అక్రమాలలో నిష్పక్ష పాతంగా వ్యవహరించని జిల్లా కలెక్టర్ తీరుపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల అధికారులకు తాను ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్‌లో జరిగిన అక్రమాలపై న్యాయం జరిగేంత వరకు తాను ఎంత వరకైనా పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. తాము రీ కౌంటింగ్ కోరడం లేదని, రీ వెరిఫికేషన్ మాత్రమే కోరుతున్నామని ఆయన వివరించారు. తొలి ప్రాధాన్యత ఓట్లలో ప్రజలు తమకే స్పష్టంగా మద్దతుగా నిలిచారని, తన ఎన్నికలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనంతపురం అర్బన్ బ్యాంకును ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యం

## - అర్బన్ బ్యాంకు చైర్మన్ జెఎల్ మురళీ



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ జెఎల్ మురళీ



కార్యక్రమంలో పాల్గొన్న ఖాతాదారులు

అనంతపురం అర్బన్, మార్చి 19 ప్రభాతవార్త

ఖాతాదారుల పెట్టుబడులకు మా భరోసా 1000 కోట్ల టర్నోవర్ సాధిం చడమే మా ధ్యేయం అని అర్బన్ బ్యాంకు చైర్మ న్ మురళీధర్ స్థానిక సుభాష్‌రోడ్డులో గల ప్రధాన కార్యా లయంలో అనంతపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంకు నూట ఏడవ మహాజన సభ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో దాదాపు వందల సంఖ్యలో ఖాతాదారులు సభ్యులు డిపాజిటర్లు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సభ అధ్యక్షుడిగా బ్యాంకు సీఈఓ విజయభాస్కర్ గత ఆరు నెలల్లో బ్యాంకు ఆర్థిక పురోగతిపై సభ్యులతో చర్చించడం జరిగింది. బ్యాంకు 2023-24 బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ముఖ్య అతిథి బ్యాంకు చైర్మన్, జెఎల్ మురళీధర్ మాట్లా డుతూ.. అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఇది సామాన్యుల బ్యాం కుగా పేరు గావించి కులం, మతం, పార్టీల కతీతంగా రుణాలు మంజూరు చేస్తూ, వ్యాపార లావాదేవీలో జాతీయ బ్యాంకులకు పోటీగా నిలుస్తూ జిల్లా లోనే అగ్రగామిగా బ్యాం కుగా పేరు గావిస్తోంది. మా నూతన పాలక వర్గం ఏర్పడిన ఈ మూడు నెలల కాలంలోనే బ్యాంకు ఎన్‌పిఎపై దృష్టి పెట్టి మొండి బకాయిల వసూలు చేసి, బ్యాంకు ఎన్పీఏ 37 శాతాన్ని, 8 శాతానికి తగ్గించ డం జరి గింది. అలాగే భవిష్యత్తులో పేద మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక అవసరాల కోసం విరివిరిగా లోన్లు ఇస్తూ వారి ఆర్తికాభివృద్దికి తోడ్ప డుతూ అలాగే మహిళల స్వయం సహాయక సంఘాల గ్రూపులకు లోన్లు అందిస్తూ మహిళ శక్తికి తోడ్పడుతామని బ్యాంకు రుణాలు మంజూరు చేస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ, విజయభాస్కర్, బ్యాంకు వైస్ చైర్మన్ కృష్ణకుమార్, రెండవ వైస్ చైర్మన్ బావిగడ్డ రమణయ్య, డైరెక్టర్లు సుంకర రమేష్, వడ్డే వెంకటాద్రి, విజి సుబ్రహ్మణ్యం, చింతా భాస్కర్, మాగి శెట్టి చంద్రశేఖర్, కెవెన్ రాధా, బ్యాంకు సిబ్బంది పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

## ఎంపీపీ సునీత,జడ్పిటీసి నీలం భాస్కర్



దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు ప్రజాప్రతినిదులు

బుక్కరాయసముద్రం మార్చి 19 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండలంలో శనివారం సాయింత్రం కురిసిన వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఎంపీపీ సునీత ,జడ్పిటీసీ నీలం భాస్కర్ అన్నారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండలంలో వర్షానికి పంటలు దెబ్బతిన్న గ్రామాలు రేగడికొ త్తూరు, గోవిందం పల్లి,చెదుళ్ళ,నీలాంపల్లి,కొర్రపాడు,రోటరీపురం గ్రామాల్లో వారితోపాటు వ్యవసాయశాఖ అనంతపురం ఎడిఎ వెంకట రాముడు,మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి,ఉద్యానశాఖధికారి శైలజ,రైతుల తో కలిసి పంట పొలాలను పరిశీలిం చారు. మండల వ్యాప్తంగ మొక్కజొన్న పంట 950 మంది రైతులకు 1650 ఎకరాల్లో నష్టపోయినట్లు ప్రాథమిక నివేదికను సంబందిత అదికారులకు పం పినట్లు తెలిపారు. పంట నష్ట పోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడిని అందజేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో వైసిపి నాయ కులు బుల్లే నారాయ ణ స్వామి, చెదుళ్ళ సర్పంచు శ్రీని వాసు రెడ్డి, కొర్రపాడు ఉప సర్పంచు శ్రీనివాసురెడ్డి, రుషింగప్ప, మసూద్‌వలి, మల్లేసు, నాగ, నాగరాజు, విద్యా సాగర్, జగన్‌మోహన్‌రెడ్డి తదితిరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



చలో ఢిల్లీ కార్యక్రమం గురించి వివరిస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం మార్చి 19 ప్రభాతవార్త

కార్మిక,రైతాంగం సమస్యల పై చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంత చేయాలని సిఐటియు,రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శిలు చంద్రశేఖర్‌రెడ్డి,బాలరంగయ్య,శ్రీనివాసులు పిలుపునిచ్చారు.ఆదివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 19 నుండి 26వరకు మండలంలో జరుగు జీపు జాతా జయప్రదం చేయాలన్నారు.కేంద్ర మోడీ ప్రభుత్వం మతంపేరుతో ప్రజలను విడదీసి పాలిస్తుందన్నారు.అంబానీ,అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపె డుతుందని విమర్శిం చారు. కార్మికుల హక్కలను కాలరాస్తు 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు.కా ర్మికులకు కనీస వేతనాలు నెలకు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి, ఆశా వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలన్నారు. స్వామినాథ్ కమి షన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతుధర ప్రకటించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామి చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పి ంచాలి రోజు కూలి 600 ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమ ంలో వారితోపాటు సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, సంజీవరెడ్డి, నాగలింగ మయ్య ,చిన్నపుల్లయ్య,చిన్నరాయుడు.అంకాలు,నారాయణస్వామి పాల్గొన్నారు.

# కనపడని ఉపాధి హామీ పౌర సమాచార పలకలు

నంబులపూలకుంట, మార్చి 19, ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాలలో పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసు ్తంది. ఈ పథకం క్రింద వివిధ రకాల అభివృద్ధి పనులు జరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగే ఈ పనులు వివరాలు స్పష్టంగా ప్రతి పౌరుడికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పని జరిగే ప్రాంతాలలో పౌర సమాఛార పలకలు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం 2017 సంవత్సరంలో ఆదేశించిందని కానీ కొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 14 పంచాయతీలలో ఉపాధ్యాయ పనులు జరుగుతున్న ఎక్కడ కానీ పౌర సమాచార పలకలు కనపడలేదు.

మండల స్థాయి ఎంపిడిఓ, ఏపిఓ, ఈసి, సాంకేతిక సహాయకులు ,బిఎఫ్‌టి క్షేత్ర సహాయకులు పనులు పర్యవేక్షిస్తున్నారు. కానీ పనులు జరిగే ప్రదేశాలలో పరిశీలించిన లక్ష్యానికి అనుగు ణంగా చేసేలా చూడాల్సిన, కానీ శిలాపలకలు ఏర్పాటు చేయాలని ఉద్దేశ్యం. సక్రమంగా పనులు చేయని కారణంగా సమాచార పలకలు అయా ప్రాంతాల లో ఏర్పాటు చేయలేదని ప్రజలనుండి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా సంభందిత అధికారులు స ్పందించి మండల కేంద్ర పరిధిలో ఎక్కడైతే వివిధ రకాల ఉపాధి పనులు జరుగుతున్నాయో అక్కడ సమాచార పలకలు ఏర్పాటు చేసినట్లైతే ప్రజలకు ప్రజాప్రతినిధులకు అందరికీ అవగాహన తెలిసే విధంగా ఉంటాయని ప్రజలు కోరుతున్నారు.

# ప్రకృతి విపత్తు ద్వారా నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

## - జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కాసెట్టి సంజీవరాయుడు



నేలకొరిగిన చెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

నార్పల రూరల్, మార్చి 19 ప్రభాతవార్త

ప్రకృతి విపత్తు ద్వారా నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదు కోవాలని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కాసెట్టి సంజీవరాయుడు పేర్కొ న్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వడగండ్లవానకు పంటలు నష్టపోయిన రైతులను ఆయన ఆదివారం పరామర్శించి రైతులకు పంట నష్టపరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షానికి అరటిపంట పూర్తిగా నేల మట్టం అయిందని ముఖ్యంగా వెంకటాంపల్లి, మద్దలపల్లి, నాయనపల్లి, గడ్డం నాగేపల్లి, కురగానపల్లి, కర్ణపుడికి, మడుగుపల్లి, వెల్లుట్ల గ్రామాల పరిధిలో చేతికి వచ్చిన పండ్లతోటలు నేలకొరిగి పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. శింగనమల నియోజకవర్గం నాయకులు కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి విపత్తులు సంభవించడం బాధాకరమన్నారు. మాది రైతు ప్రభుత్వమని ప్రగల్బాలు పలికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వేలాది ఎకరాల్లో పంటలు నష్ట పోయిన రైతులను పరామర్శించి వారికి సహాయ సహకారాలు అందించడంలో విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుపాకుల భాస్కర్, విశ్వనాథ్‌రెడ్డి, ఆకుల అశోక్, బాబా నజీర్, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.